మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati
సంపుటి : 01 సంచిక :44 | మంగళవారం , 14 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## నేటిమాట

"పిల్లలు సమాజానికి పునాదుల వంటివారు. దేశం భవిష్యత్తు వారి పైనే ఆధారపడి ఉంది."

- నెహ్రూ



సంక్రాంతి పండుగ సందర్భంగా మా పత్రిక కార్యాలయానికి నేడు సెలవు ఉంటుంది. ఈ కారణంగా రేపటి (తేదీ - 15-01-2025) సంచిక వెలువడదు.

తాజా సమాచారంతో, తదుపరి సంచికలో మిమ్మల్ని మళ్లీ కలుస్తాం.

-ఎడిటర్



# స్టాక్ మార్కెట్లు క్రాష్..

## రూ.14లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి..!

### నాలుగు రోజుల్లో రూ.24.69 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ -30 ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ ఒక శాతానికి పైగా పతనం అయ్యాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 1031.61 పాయింట్ల (1.35 శాతం) నష్టంతో 76,347.26 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 77,128.35 పాయింట్ల గరిష్ఠం నుంచి 76,249.72 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 345.55 పాయింట్లు (1.47 శాతం) నష్టంతో 23,085.95 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 23,340.95 పాయింట్ల గరిష్టానికి, 23,047.25 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. ఫలితంగా ఇన్వెస్టర్లు రూ.14 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కోల్పోయారు.

ఎన్ఎస్ఈ-50లో 46 స్టాక్స్ నష్టపోయాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్, బీపీసీఎల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారత్ ఎలక్ట్రానిక్స్ నష్టపోయాయి. మరోవైపు యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, హిందూస్థాన్ యూనీ లివర్, ఇండస్ఇండ్ బ్యాంకు సహా నాలుగు స్టాక్స్ 0.78 శాతం వరకూ లాభ పడ్డాయి.

బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో జోమాటో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టపోయాయి. టీసీఎస్, ఇండస్ఇండ్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌యూఎల్ షేర్లు మాత్రమే లాభ పడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ 80.83 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, ఔన్స్ బంగారం ధర 2708.డాలర్ల వద్ద నిలిచింది.

2లో

# మహా కుంభమేళా ప్రారంభం..

## మొదటిరోజు 61 లక్షల మంది త్రివేణిలో పుణ్యస్నానాలు




హైదరాబాద్ ,13 జనవరి ( క్రాంతి న్యూస్ ):

ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక అయిన మహా కుంభమేళా ఘనంగా ఆరంభమైంది. ఈ అత్యంత ప్రముఖమైన వేడుక గంగా, యమునా, సరస్వతీ నదుల సంగమ ప్రదేశం అయిన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతోంది. ఈ సందర్భంగా, పుష్య పౌర్ణమి రోజున సోమవారం తెల్లవారుజామునుంచే లక్షలాదిమంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమానికి చేరుకొని పవిత్ర స్నానాలు చేసేందుకు వస్తున్నారు. భక్తుల పూజలతో ఈ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగుతోంది. స్థానిక అధికారుల ప్రకారం.. ఉదయం 7.30 గంటల ఇప్పటి వరకు దాదాపు 35 లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. మొదటిరోజే 61 లక్షల మంది ఈ ప్రాంతానికి పుణ్యస్నానాలకు రానున్నారని సమాచారం.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు

హైదరాబాద్ ,13 జనవరి ( క్రాంతి న్యూస్ ): హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓ టీవీ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చి వెళ్తుండగా ఆయన్ను కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తరలించారు.

కరీంనగర్‌లో ఆదివారం జరిగిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నిలదీశారు. ఈ క్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తో వాగ్వాదం జరిగింది. ఈ ఘటన నేపథ్యంలో పాడి కౌశిక్ రెడ్డిపై కరీంనగర్ పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు.



## తెలంగాణలో ప్రజాస్వామ్యం లేకుండా పోయింది..

### ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టుపై హరీశ్ రావు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టుపై తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని 10 టీవీ ఆఫీసులో ఇంటర్వ్యూ ఇచ్చి బయటకు వెళ్తున్న సమయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేసి కరీంనగర్ తీసుకెళ్లిన విషయం తెలిసిందే.

2లో

## ఈ అరెస్టు దుర్మార్గమైన చర్య - కేటీఆర్

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అక్రమంగా అరెస్టుచేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ట్వీట్‌లో ఈ అరెస్ట్‌ను ఖండించారు.

"పూటకో అక్రమ కేసు పెట్టడం.. రోజుకో బీఆర్ఎస్ నేతను అన్యాయంగా అరెస్టుచేయడం రేవంత్ సర్కారుకు ఓ అలవాటుగా మారింది.

# మంత్రి పొంగులేటి మీద

## తిరగబడ్డ ఖమ్మం ప్రజలు

ఖమ్మం ,13 జనవరి ( క్రాంతి న్యూస్ ):

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నిరసన సెగ తగిలింది. అనర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎలా ఇచ్చారంటూ ఓ గిరిజన కుటుంబం మంత్రిని చుట్టుముట్టింది. ఈ ఘటన ఖమ్మం జిల్లాలోని సాక్షాత్తూ మంత్రి సొంత నియోజకవర్గమైన పాలేరులోనే చోటుచేసుకుంది. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం దుబ్బతండాలో డబుల్ బెడ్ రూం ఇళ్లను సోమవారం ప్రారంభించిన మంత్రి పొంగులేటి.. వాటిని లబ్ధిదారులకు అందజేశారు.




## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాసంలో సంక్రాంతి వేడుకలు




### జూబ్లీహిల్స్ నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రివ్యూ




హైదరాబాద్ ,13 జనవరి ( క్రాంతి న్యూస్ ):

పెట్టుబడులకు గమ్య స్థానంగా ఇప్పటికే తెలంగాణ దేశంలోని అందరి దృష్టిని ఆకర్షిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణముందని సీఎం అభిప్రాయపడ్డారు. ఫ్యూచర్ సిటీగా వెలుగొందుతున్న హైదరాబాద్ సిటీలో ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు.




## తిరుమలలో వరుస ప్రమాదాలు




## కూలీలు తిరగబడుతారు.. తస్మాత్ జాగ్రత్త..!

రేవంత్‌ను హెచ్చరించిన హరీశ్‌రావు




## జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తు నోటిఫికేషన్ విడుదల




## రేవంత్ డమ్మీ చెక్ ఇచ్చావా..? - హరీశ్‌రావు




## లాస్ ఏంజిల్స్‌లో కార్చిచ్చు..



# స్టాక్ మార్కెట్లు క్రాష్..

**రూ.14లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి..!**

**నాలుగు రోజుల్లో రూ.24.69 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హుష్‌కాకి..!**

మొదటి పేజీ తరువాయి

దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజులుగా 'బేర్'మంటున్నాయి. నాలుగు సెషన్లలో ఇన్వెస్టర్లు రూ.24.69 లక్షల కోట్ల సంపద కోల్పోయారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, నిరంతరం విదేశీ నిధుల ఉపసంహరణతోపాటు ఉద్యోగాల కల్పన మెరుగుదలతో యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు తగ్గింపు అవకాశాలు సన్నగిల్లాయి. మరోవైపు, ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ గత రెండేండ్లలో తొలిసారి జీవిత కాల కనిష్టానికి పతనమైంది.

ఫలితంగా ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ బలహీన పడింది. దీంతో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ గత శుక్రవారం.. 1048.90 పాయింట్ల నష్టంతో 76,330.01 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.24,69,243.3కోట్లు కోల్పోయి రూ.4,17,05,906.74 కోట్ల వద్ద నిలిచింది. అంతే కాదు శుక్రవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.82 లక్షల కోట్ల డాలర్ల దిగువకు పతనమైంది. సోమవారం ఇన్వెస్టర్లు రూ.12.61 లక్షల కోట్లు కోల్పోయారు.

సెగెటివ్ సెంటిమెంట్ నేపథ్యంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ నెలలో రూ.20 వేల కోట్ల విలువ గల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. రష్యా ముడి చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ 1.43 శాతం పుంజుకుని 80.90 డాలర్ల వద్ద ట్రేడయింది. బీఎస్ఈలో 3562 షేర్లు నష్టపోగా, 555 స్టాక్స్ లాభ పడ్డాయి. మరో 131 స్టాక్స్ యథాతథంగా కొనసాగాయి.



# మహా కుంభమేళా ప్రారంభం..

## మొదటిరోజు 61 లక్షల మంది త్రివేణిలో పుణ్యస్నానాలు

మొదటి పేజీ తరువాయి

భూ గ్రహంపైనే అత్యంత భారీ జన సమూహంతో హాజరయ్యే ఈ కార్యక్రమం 45 రోజులపాటు కొనసాగనుంది. దీని కోసం దేశ-విదేశాల నుంచి కోట్లాదిమంది భక్తులు, పర్యటకులు వచ్చి పాల్గొననున్నారు. ఈ వేడుక కోసం మొత్తం 35 కోట్ల మంది వస్తారని యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని, భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడం, అలాగే భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా, నదిలో నిరంతరం పహారా కాసేందుకు ప్రత్యేకంగా తేలియాడే పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారు. అటు, చిన్న చిన్న పడవలపై భద్రతా సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నాయి.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ కుంభమేళా ప్రారంభంపై స్పందించారు. "భారతీయ విలువలు, సంస్కృతిని గౌరవించే కోట్లాది మందికి ఇది ఎంతో ప్రత్యేకమైన రోజు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. ఈ వేడుక విశ్వాసం, భక్తి, సంప్రదాయాల సంగమంతో ఎంతోమందిని ఒకచోట చేర్చింది. మన దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ వేడుక ప్రతిబింబిస్తుంది. పవిత్ర స్నానాలు ఆచరించి, భగవంతుడి ఆశీస్సులు తీసుకునేందుకు లెక్కలేనంతమంది రావడం ఎంతో సంతోషంగా ఉంది" అని ప్రధాని మోదీ ఎక్స్ వేదికపై రాసుకొచ్చారు.

ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు ఏర్పాట్లు కోసం 10,000 ఎకరాల్లో విస్తరించిన ప్రాంతాన్ని సిద్ధం చేశారు. ఎటువంటి పరిస్థితులలోనైనా 50 లక్షల నుంచి 1 కోట్ల మంది భక్తులు సౌకర్యంగా ఉండేలా అన్ని ఏర్పాట్లను కల్పించారు. భద్రత కోసం 55 పోలీసు స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసి, 45,000 మంది పోలీసులను విధుల్లో పెట్టింది. కుంభమేళాలో 13 అఖాడాలు భాగం అవుతాయని, వీటి ద్వారా అనేక సాధువులు, భక్తులు ఈ వేడుకలో పాల్గొంటారని సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు.

జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకు ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక సంరంభం అయిన మహా కుంభమేళా వేడుక కొనసాగనుంది. ఈ వేడుకలో పాల్గొనేందుకు ప్రయాగ్‌రాజ్ కు కోట్లాది భక్తులు చేరుకోవాలని అంచనా వేయబడింది. భక్తులకు అన్ని సౌకర్యాలు అందించేందుకు యూపీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశాయి. హిందూ సమాజంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ మహాకుంభమేళాకు ఈసారి 40 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేయబడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి.

### రవాణా సౌకర్యాలు

ప్రయాగ్‌రాజ్‌కు భక్తులను రవాణా చేసేందుకు అన్ని రకాల సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి. యూపీ ఆర్టీసీతో పాటు భారతీయ రైల్వే, వివిధ ఎయిర్‌లైన్స్ సంస్థలు భక్తులకు సేవలు అందించడానికి రెడీ అయ్యాయి.

యూపీ ఆర్టీసీ రవాణా ఏర్పాట్లు: యూపీ ఆర్టీసీ ఈ కుంభమేళాకు 7,550 బస్సులను నడపనుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ప్రయాగ్‌రాజ్‌కి బస్సుల సేవలు అందుబాటులో ఉంటాయి. మేళా వేదిక వద్దకు భక్తులను తరలించేందుకు 550 కొత్త షటిల్ బస్సులను కూడా ఏర్పాటు చేశారు. పొరుగున ఉన్న ఢిల్లీ, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, బీహార్, ఝార?ండ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి కూడా ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 3 కోట్ల మంది భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాగ్‌రాజ్‌కు రాగలరని అంచనా వేయబడింది. రోజుకు సుమారు 8 లక్షల మంది బస్సుల ద్వారా ప్రయాగ్‌రాజ్ చేరుకోనున్నారు.

రైల్వే రవాణా ఏర్పాట్లు: రైల్వే కూడా మహా కుంభమేళా కోసం భారీ ఏర్పాట్లు చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 13,000 ప్రత్యేక రైలు సర్వీసులను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రధాన నగరాల నుండి ప్రయాగ్‌రాజ్‌కి రైలు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. అదనంగా 50 నగరాల నుంచి కూడా ప్రత్యేక రైలు సర్వీసులను ఏర్పాటు చేశారు.

ఎయిర్‌లైన్స్ సర్వీసులు: ఎయిర్‌లైన్స్ సంస్థలు కూడా ప్రయాగ్‌రాజ్‌కు భక్తులను చేరవేయడానికి సిద్ధమయ్యాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, బిలాస్‌పూర్, హైదరాబాద్, రాయ్‌పూర్, లక్నో, భుబనేశ్వర్, కోల్‌కతా, డెహ్రాడూన్, చండీఘడ్ వంటి నగరాల నుండి నేరుగా ప్రయాగ్‌రాజ్‌కి విమానాలు అందుబాటులో ఉంటాయి. అదనంగా, జమ్మూ, చెన్నై, పట్నా, నాగ్‌పూర్, అయోధ్య, పూణె, భోపాల్ వంటి నగరాల నుండి కూడా విమాన సర్వీసులు అందుబాటులో ఉంటాయి. సంగమ్ ప్రాంతానికి 19 కిలోమీటర్ల దూరంలో ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టు ఉంది. అక్కడి నుండి ఎలక్ట్రిక్ బస్సులు ఈ ప్రాంతానికి సులభంగా తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈ బస్సుల టికెట్ ధర కేవలం రూ.35. ట్యాక్సీలు, క్యాబులు కూడా రూ.1,000 లోపే అందుబాటులో ఉంటాయి.

ఈసారి కుంభమేళా వేడుకలు ఎప్పటికి గుర్తుండిపోయేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాయి. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని అధికారులు జాతీయ మీడియాకు తెలిపారు.



# మంత్రి పొంగులేటి మీద తిరగబడ్డ ఖమ్మం ప్రజలు

మొదటి పేజీ తరువాయి

అయితే, ఇళ్ల ప్రారంభ కార్యక్రమంలో అర్హుల పేర్లు తొలగించడాన్ని, అనర్హుల పేర్లు జాబితాలో వెల్లడించడాన్ని గమనించిన ఓ గిరిజన కుటుంబం వెంటనే మంత్రి ఎదుటే నిరసనకు దిగింది. అర్హుడినైన తనకు డబుల్ బెడ్ రూం ఇల్లు ఎందుకు ఇవ్వలేదంటూ అదే తండాకు చెందిన బోడా సేవా, అతడి తల్లి, భార్య అక్కడే ఆందోళన చేపట్టారు. అర్హుల జాబితాలో నిన్న (ఆదివారం) తన పేరును ప్రకటించిన అధికారులు.. ఇవ్వాళ (సోమవారం) ఇళ్ల ప్రారంభోత్సవం నాటికి జాబితా నుంచి తన పేరును ఎందుకు తొలగించారంటూ ప్రశ్నించారు. వెంటనే మంత్రి పొంగులేటిని ఆ మహిళలు చుట్టుముట్టారు.

సాగు భూములు ఉన్న వారికి కూడా ఈ 29 డబుల్ బెడ్ రూం ఇళ్లలో చోటు కల్పించారని ఫిర్యాదు చేశారు

కానీ సాగు భూమి, ఇల్లు కోల్పోయిన తమకు డబుల్ బెడ్ రూం ఇల్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ అర్హతను పరిశీలించి తమకు ఇల్లు ఇవ్వాలని కోరారు. దీంతో సంబంధిత అధికారులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులను ఎవరు ఎంపిక చేశారని అధికారులను ప్రశ్నించారు. ఎంపిక విధానం పారదర్శకంగా ఉండాలని, అర్హులకే ఇళ్లు ఇవ్వాలని సూచించారు. ఈ ఇళ్ల కేటాయింపు, లబ్ధిదారుల ఎంపికపై మరోసారి విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ డబుల్ బెడ్ రూం పథకంలో ఇళ్లు రాని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మాట ఇచ్చారు.



# తెలంగాణలో ప్రజాస్వామ్యం లేకుండా పోయింది..

**ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టుపై హరీశ్ రావు**

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టుపై తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని 10 టీవీ ఆఫీసులో ఇంటర్వ్యూ ఇచ్చి బయటకు వెళ్తున్న సమయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేసి కరీంనగర్ తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ అరెస్టుపై హరీశ్ రావు 10 టీవీతో మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని అన్నారు. ఒక రౌడీ షీటర్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు కౌశిక్ రెడ్డిని అరెస్టు చేశారని అన్నారు. పండుగ రోజు ఉద్దేశపూర్వకంగానే ఆయనను అరెస్టు చేశారని చెప్పారు.

కాంగ్రెస్ సర్కారు పాలనలో తెలంగాణలో క్రైమ్ రేట్ 23 శాతం పెరిగిందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని తెలిపారు. ఒకే కేసులో కౌశిక్ రెడ్డిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని అన్నారు. కాగా, కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు మొత్తం 35 మంది పోలీసులు వచ్చారు. కరీంనగర్ జిల్లా జడ్జి ఎదుట కౌశిక్ రెడ్డిని మొదట పోలీసులు హాజరుపరుస్తారు.

# ఈ అరెస్టు దుర్మార్గమైన చర్య - కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి దిగజారుడు పనులకు దిగుతున్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను వెనకేసుకొచ్చి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని ఏకపక్షంగా అరెస్టుచేయడం పూర్తిగా అప్రజాస్వామికం. హుజూరాబాద్ నియోజకవర్గంలో రైతురుణమాఫీని ఎగ్గొట్టి, దళితబంధుకు పాతరేసిన కాంగ్రెస్ సర్కారును ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేకే ముఖ్యమంత్రి ఈ అణచివేత చర్యలకు దిగుతున్నారు.

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన సీఎం రేవంత్ రెడ్డిపై చర్య తీసుకోవాల్సిందిపోయి ప్రజల పక్షాన ప్రశ్నించిన కౌశిక్ రెడ్డిపై కేసులు పెట్టడమే మీ ఇందిరమ్మ రాజ్యమా? పోరాటాలే ఊపిరిగా పుట్టిన గులాబీ పార్టీ నేతల ఆత్మస్థైర్యాన్ని ఇలాంటి చిల్లర చేష్టలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ దెబ్బతీయలేదు. అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అని కేటీఆర్ అన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యే సంజయ్‌పై దురుసుగా ప్రవర్తించారని ఆయన పీఏ ఫిర్యాదు చేయడంతోపాటు సమావేశంలో గందరగోళం, పక్కదారి పట్టించారని ఆర్డీవో ఫిర్యాదు చేశారు. దీంతో కరీంనగర్‌లోని ఒకటో పట్టణ పోలీసులు వివిధ సెక్షన్ల కింద మూడు కేసులు నమోదుచేశారు. ఈ కేసుల నేపథ్యంలోనే పాడి కౌశిక్ రెడ్డిని ఇవాళ జూబ్లీహిల్స్‌లో అరెస్టు చేశారు.

### అసలేం జరిగిందంటే..

ఆదివారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశం వాడివేడిగా జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో జగిత్యాల ఎమ్మెల్యేను కౌశిక్‌రెడ్డి పలు ప్రశ్నలతో నిలదీశారు. 'నువ్వు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడివి. నీకు ఇక్కడ మాట్లాడే అర్హత లేదు. ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నవో చెప్పాలి? అని ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు నెట్టుకుంటూ దూషించుకున్నారు. ఆదివారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశం వాడివేడిగా జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో జగిత్యాల ఎమ్మెల్యేను కౌశిక్‌రెడ్డి పలు ప్రశ్నలతో నిలదీశారు. 'నువ్వు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడివి. నీకు ఇక్కడ మాట్లాడే అర్హత లేదు. ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నవో చెప్పాలి? అని ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు నెట్టుకుంటూ దూషించుకున్నారు.

## జూబ్లీహిల్స్ నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రివ్యూ

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులన్నీ తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయని సీఎం అన్నారు.

హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జనవరి 20 నుంచి దావోస్ పర్యటన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణ, వాటి పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు.

గత ఏడాది ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఏయే కంపెనీలు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయి.. అవి ఏయే దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారిగా పెట్టుబడులు వచ్చాయని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

14 ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడుల కు ముందుకు వచ్చాయి. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయని, వీటిలో దాదాపు 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగం పుంజుకున్నాయని, ఏడు ప్రాజెక్టుల అమలు ప్రారంభ దశలో ఉందని తెలిపారు. కంపెనీల వారిగా పురోగతిని మంత్రి శ్రీధర్ బాబుతో సీఎం చర్చించారు.

ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు ముఖ్యమంత్రి దావోస్ లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటన లో ఉంటారు. సింగపూర్ లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలతో పాటు ఇతర పెట్టుబడులకు సంబంధించి సంప్రదింపులు జరుపుతారు. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ 6 రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూలుతో పాటు, అక్కడ జరిగే సదస్సులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు.



**విలేకరులు కావలెను..**

మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా?

నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?

మన క్రాంతి తెలుగు దిన పత్రికలో

పనిచేయుటకు మండలాల వారీగా విలేఖరులు,

యాడ్ ఎగ్జిక్యూటివ్ లు (పురుషులు మరియు స్త్రీలు) కావలెను.

కాల్ : 9281041008 వెబ్: https://epaper.krtvnews.com


ఈమెయిల్: krtv.md@gmail.com



# తెలంగాణ

## కూలీలు తిరగబడుతారు.. తస్మాత్ జాగ్రత్త..!

### రేవంత్‌ను హెచ్చరించిన హరీశ్‌రావు




ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వ్యవసాయ కూలీలందరికి వర్తింపజేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేదంటే గ్రామాల్లో కూలీలు తిరగబడుతారు.. తస్మాత్ జాగ్రత్త అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అనే పథకం కింద వ్యవసాయ కూలీలకు నెలకు వెయ్యి చొప్పున 12 వేలు ఇస్తామన్నారు. ఉపాధి హామీ పనిలో మట్టి పనులకు పోయే వారిని వ్యవసాయ కూలీలుగా గుర్తిస్తామన్నారు. మన రాష్ట్రంలో 50 లక్షల ఉపాధి హామీ కార్డుల కింద.. కోటి 2 లక్షల మంది మట్టి పనికి వెళ్తున్నారు. ఒక్క సెంట్ భూమి ఉన్నా.. వారు కూలీ కాదు అని నిబంధన పెట్టారు. ఉపాధి హామీ కింద ఈ ఏడాది 20 రోజులు పని చేసి ఉంటేనే కూలీ అని గుర్తిస్తామన్నారు. సెంటు భూమిలో ఏమైనా పండుతదా..? ఆ సెంటు భూమిలో వ్యవసాయం చేసుకుని దళితుడు, గిరిజనుడు బతుకుతాడా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

ఎకరం కంటే తక్కువ భూమి ఉన్న రైతులు 24 లక్షల 57 వేల మంది రైతులు ఉన్నారు. ఇందులో దళితులు, గిరిజనులు, బీసీలు ఉన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంటే దళిత గిరిజన రైతులకు శఠగోపం పెట్టడమేనా..? వాళ్ల నోరు నొక్కడమేనా..? ఈ పథకాన్ని వారికి వర్తింపజేయొద్దని, వారి నోర్లు నొక్కాలని మీకు చేతులు ఎలా వచ్చాయి..? కోటి మంది కూలీలు ఉంటే 10 లక్షల మందికే ఇస్తామంటున్నారు. ప్రభుత్వం నిజాయితీగా ఆలోచించి.. ఎకరం లోపు ఉన్న రైతులకు మేలు చేయాలి. నీకు ఇష్టం లేకపోతే పథకం బంద్ చేయ్.. తప్పయిందని క్షమాపణ చెప్పు. వ్యవసాయ కూలీలను మోసం చేయొద్దు. రెక్కాడితే కానీ డొక్కాడని కూలీలకు కోత పెట్టడం అవసరమా..? వ్యవసాయ కూలీల పక్షాన కోరుతున్నాను.. ఉపాధి హామీలో మట్టి పనికి వెళ్లే కూలీకి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయండి. గ్రామ సభలు పెడితే తిరగబడుతారని హెచ్చరిస్తున్నా.. కూలీలు తిరగబడుతారని తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరిస్తున్నా.. ఆకలి ఉంది కాబట్టి కడుపు నింపుకోవడానికి కూలీకి పోతున్నారు.. ఎకరం లోపు భూములు ఉన్నవారందరిని వ్యవసాయ కూలీలుగా గుర్తించి ఈ పథకం కింద లబ్ది చేకూర్చాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## రేవంత్ డమ్మీ చెక్ ఇచ్చావా..? - హరీశ్‌రావు

కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఎన్నికల్లో డమ్మీ హామీలిచ్చినట్టు.. ఏమైనా డమ్మీ చెక్ ఇచ్చావా..? అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు ప్రసంగించారు.

భోగభాగ్యాలను అందించే భోగి పండుగ, కొత్తకాంతులను తెచ్చే సంక్రాంతి పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్ సర్కార్.. రైతులను కుడి ఎడమలుగా దగా చేస్తోంది. అడుగడుగునా మోసం చేస్తోంది. రైతుల విషయంలో కాంగ్రెస్ పార్టీ మాటలు కోటలు దాటుతున్నాయి.. చేతలు గడపదాటడం లేదు అని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు.

రైతు రుణమాఫీ గురించి పాలమూరు జిల్లాలో రెండు నెలల కిందట సీఎం రేవంత్ రెడ్డి రూ. 2 వేల 750 కోట్ల రుణమాఫీ విడుదల చేసినట్టు చెక్ ఇచ్చారు. ఇవాళ్టికి కూడా సంగారెడ్డికి డబ్బులు రాలేదు. ఇంతకుముందే మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా రైతులతో మాట్లాడాను. ఎక్కడ కూడా ఒక్క రూపాయి డబ్బు పడలేదని రైతులు చెప్పారు. సీఎం ఇచ్చిన చెక్‌కు విలువ లేదా..? అసలు ఏమన్న గౌరవం ఉందా ఈ ప్రభుత్వానికి. నవంబర్ 30న చెక్ ఇచ్చారు. ఈ రోజుకు రైతుల అకౌంట్లలో డబ్బులు పడలేదు. నువ్వు ఏమైనా డమ్మీ చెక్ ఇచ్చావా..? ఎన్నికల్లో డమ్మీ హామీలు ఇచ్చినట్టు..? నీవు ఇచ్చిన చెక్ ఎందుకు పాసైతలేదు. దీనిమీద స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. అధికారులు తప్పు చేస్తే చర్య తీసుకోండి. చెక్ బౌన్స్ అయిందా..? లేదా చెక్ దారి తప్పిపోయిందా..? ఎందుకు రైతుల అకౌంట్లలో డబ్బులు పడటం లేదు. అందరికీ రుణమాఫీ అని కొంతమందికే పరిమితం చేశారు. రూ. 2 లక్షల కంటే ఎక్కవ ఉన్న వారు అప్పులు తెచ్చి కడితే కూడా ఇప్పటికీ రుణమాఫీ కాలేదు. బోనస్ బోగస్‌గా మారింది. కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తానని దగా చేశారని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

రైతు భరోసా రూ. 15 వేలు అని చెప్పి రూ. 12 వేలు ఇస్తూ దగా చేశారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని చెప్పకనే చెబుతున్నారు. ఎన్నికలప్పుడు అరచేతిలో వైకుంఠం చూపి.. ఎన్నికలయ్యాక మోడి చేయి చూపిస్తున్నారు. సంక్రాంతి పండుగకు ఊరేళ్తే రైతులతో మాట్లాడి.. కాంగ్రెస్ సర్కార్ మోసాలను చెప్పండి. రుణమాఫీ బాధలు, బోనస్ మాటలు, పంటల బీమా గురించి మాట్లాడండి. కేసీఆర్ పాలనలో రైతులను కాపాడుకున్నారు.. రేవంత్ 13 నెలలో ఎలా మోసం చేశారో చెప్పండి రైతులకు. వాస్తవాలు ప్రజలకు తెలియాలి. రైతులను రేవంత్ రెడ్డి మోసం చేసిన తీరుపై చర్చ పెట్టండి. అయితే ఎగవేతలు.. లేదంటే కోతలు.. ఈ విధంగా రైతులకు తీవ్ర అన్యాయం చేశారు. రైతుల కష్టాలు తెలుసుకుని వారికి భరోసా ఇవ్వండి.. కాంగ్రెస్ మీద పోరాటానికి సన్నద్ధం కావాలి. ప్రభుత్వం మెడలు వంచి ఈ పథకాలను అమలు చేసేలా పోరాటం చేయాలని హరీశ్‌రావు పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు.



## జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తు నోటిఫికేషన్ విడుదల

తెలంగాణ పసుపు రైతులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న పసుపు బోర్డు ఏర్పాటులో కీలక ముందడుగు వేసింది. జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తు నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం.. ఛైర్మన్ గా పల్లె గంగారెడ్డిని ప్రకటిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు పసుపు కోసం ప్రత్యేక బోర్డు లేని నేపథ్యంలో.. పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల నుంచి బలమైన డిమాండ్ ఉంది. ఒకానొక దశలో పసుపు రైతులు రాజకీయంగానూ ఈ అంశాన్ని చాలా తీవ్రమైన అంశంగా మార్చారు. ఎంపీ ఎన్నికల్లో వందల మంది నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీలో నిలుచుని.. అక్కడ ఫలితాల్ని తారుమారు చేశారు. ఈ నేపథ్యంలో.. గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించిన కేంద్రం.. తాజాగా అందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది.

## ఎస్సీ వర్గీకరణకై చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.




చెన్నరావుపేట,13 జనవరి (క్రాంతిన్యూస్ ): వెయ్యి గొంతులు లక్ష డప్పులు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ల సునీల్ గారి ఆదేశం మేరకు నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట మండల కేంద్రంలో డప్పు కళాకారుల సంఘం నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు అబ్బ దాసి యాకన్న ఆధ్వర్యంలో ఈరోజు డప్పుల ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎం పి ఎస్. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మేకల సదానందం, డప్పు కళా కారుల సంఘం నర్సంపేట డివిజన్ అధ్యక్షులు అబ్బదాసి యాకన్న పాల్గొని మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తారీఖున హైదరాబాద్లో జరిగే వెయ్యి గొంతులు లక్ష డప్పుల కార్యక్రమాన్ని మాదిగ సమాజం మొత్తం కూడా అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వెయ్యి గొంతులు లక్ష డప్పుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ల సునీల్, ఎం పి ఎస్. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మేకల సదానందం ఎం అర్ పి ఎస్ సీనియర్ నాయకులు బహుజన ఒంటరి రాములు, సదిరం రాజు మేకల రాజు, మాదాసి కొమురయ్య జన్ను సాంబయ్య, గన్నారపు మల్లయ్య, మాదాసి సారయ్య బిక్షపతి, మేకల దయాకర్ సుంకరి రాజు, బిక్షపతి,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మిత్రునికి అండగా నిలిచిన తోటి మిత్రులు

### ఆర్థిక సహాయం రూ.20 వేలు అందజేత



చెన్నరావుపేట,13 జనవరి (క్రాంతిన్యూస్ ):మిత్రునికి అండగా జాగృతి పాఠశాల మిత్రులు అండగా నిలిచారు..చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన యాట అజయ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న మిత్రులు అజయ్ ఇంటికీ చేరుకొని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మనో ధైర్యాన్ని కల్పించి తోటి మిత్రులు అందించిన రూ.20వేలను అందించారు.ఈ కార్యక్రమంలో కేంచ ప్రవీణ్ అన్న బీరేంద్ర పులిశెరు రాజేందర్ వల్ల వేణు పల్లకొండ తిరుపతి వైనాల రాజు గాదగోని రాజు రొడ్డ కుమారస్వామి ఉపాధ్యాయుల బృందం నుండి రమాదేవి రమేష్ యాదగిరి లు ఆర్థిక సాయం అందించిన వారిలో ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ములుగు జిల్లా ప్రతినిధి,13 జనవరి (క్రాంతిన్యూస్ ):ములుగు మండలంలోని జంగాలపల్లి శ్రీ దివ్య జ్యోతి గురుకుల విద్యాలయం 2000 -01 బ్యాచ్ కి చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు 25 సంవత్సరాల ముందు చూసిన తమ విద్యార్థులు ఇప్పుడు వివిధ స్థాయిలలో మంచి భవిష్యత్తు నిర్మించుకున్న ఆ విద్యార్థులను చూసి గురువులు చాలా ఆనందంతో మురిసిపోయారు. వివిధ ఉద్యోగాల రీత్యా ఎంతో దూరం ఉన్నటువంటి తమ గురువులను వారి నెంబర్లను కష్టపడి సంపాదించి ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన కార్యనిర్వాహకులకు గురువులు అభినందించారు. అనంతరం గురువులను సత్కరించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరికొకరు ఆత్మీయ పలకరింపు చేసుకోవడం జరిగింది. అనంతరం 25 ఏళ్ళు పూర్తి అయినందున కేక్ కట్ చేసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ర రాజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## కోడి పందాలు పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు

### ఎస్సై సిహెచ్ చంద్రశేఖర్




అన్నపురెడ్డిపల్లి,13 జనవరి (క్రాంతిన్యూస్ ):సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా కోడి పందాలు పేకాట లు నిర్వహించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నపురెడ్డిపల్లి ఎస్సై సిహెచ్ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నపురెడ్డిపల్లి మండల పరిసర గ్రామాల్లోని ఎవరైనా కోడి పందాలు, పేకాట ఆడినట్లయితే వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా కోడి పందాలు పేకాట ఆడుతున్నట్లుగా తెలిస్తే తమకు సమాచారం అందించాలని, పందెపు రాయుళ్లను ప్రత్యేకమైన ఫోర్స్ ద్వారా పట్టుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. అందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరూ తమ ఇంటి వద్దనే ఉండి తమ కుటుంబ సభ్యులతో పండగ వాతావరణాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

## ఘనంగా గోదాదేవి కల్యాణం

ములుగు జిల్లా ప్రతినిధి,13 జనవరి (క్రాంతిన్యూస్ ):ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలో సోమవారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గోదాదేవి రంగనాథుల కళ్యాణం వేద పండితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, వినయ్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీధర్, జగన్నాథ చారి కూనూరు అశోక్, సాంబయ్య భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## నేడు గోదా కళ్యాణం. నాగ సుబ్రహ్మణ్య విగ్రహ ప్రతిష్ట

సంగెం,13 జనవరి (క్రాంతిన్యూస్ ): కొమ్మాల శ్రీ లక్ష్మి నర్సింహ స్వామి దేవస్థానం గుట్ట వద్ద నేడు మంగళవారం రోజున ఉ9 గం॥లకు గోదా రంగనాథుల కళ్యాణం బ్రహ్మాండంగా జరుగును మరియు 12 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంది కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందగలరని లక్ష్మీనరసింహస్వామి ప్రధాన పూజారి కాండూరి. రామాచార్యులు తెలిపారు.

# తిరుమలలో వరుస ప్రమాదాలు

## నిన్న తొక్కిసలాట, నేడు అగ్నిప్రమాదం.. బస్సు ప్రమాదం



ఇటీవలే తిరుపతిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల జారీ కౌంటర్ దగ్గర తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు చనిపోయారు. 30 మందికిపైగా భక్తులు గాయపడ్డారు. స్వామి వారి వైకుంఠ దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం పెను విషాదాన్ని నింపింది. టీటీడీ చరిత్రలో ఎన్నడూ ఇలా జరిగింది లేదని అధికారులు తెలిపారు. ఇది మరువక ముందే.. తిరుమలలో మరో అపశ్రుతి జరిగింది. ఈసారి లడ్డూ కౌంటర్ లో అగ్నిప్రమాదం సంభవించింది. అంతే కాదు భక్తులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒకటి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ పిట్టగోడను ఢీ కొట్టింది. ఈ వరుస ఘటనలు భక్తుల్లో కలవరం నింపాయి.

నిత్య కళ్యాణోత్సవాలు, పచ్చతోరణంగా నిత్యం వేద ఘోషతో ప్రజ్వరిల్లే తిరుమల తిరుపతి దేవస్థానం గత కొంత కాలంగా వివాదాలకు నెలవుగా మారింది. మొన్న వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే సోమవారం లడ్డూ ప్రసాద కౌంటర్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. 7వ నెంబర్ లడ్డూ కౌంటర్ వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనతో భక్తులు భయంతో వణికిపోయారు. చెల్లా చెదురుగా భక్తులంగా పరుగు లంకించుకున్నారు. లడ్డూ టోకెన్లు జారీ చేసె కంప్యూటర్‌కు సంబంధించిన యూపీఎస్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. హమ్మయ్య.. అనుకునేలోపే ఇదే రోజు తిరుమలలో మరో పెను ప్రమాదం తప్పింది. పదుల సంఖ్యలో భక్తుల ప్రాణాలు తృటితో తప్పించుకున్నాయి.

భక్తులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒకటి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ పిట్టగోడను ఢీ కొట్టింది. హరిణి దాటిన తర్వాత రెండో ఘాట్ రోడ్డు వద్ద గోడను ఢీకొట్టింది. అయితే క్రాష్ బారియర్ పటిష్టంగా ఉండటంతో బస్సు లోయలోకి పడిపోకుండా రోడ్డుపైనే నిలిచిపోయింది. లేదంటే ఆర్టీసీ బస్సు పక్కనే ఉన్న లోయలోకి జారిపడి ఊహించని ప్రమాదం జరిగుండేది. తలచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అదృష్టవశాత్తూ పెను ప్రమాదం తప్పింది. దీంతో శ్రీవారి భక్తులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదం కారణంగా ఆర్టీసీ బస్సు రోడ్డు మధ్యలోనే అడ్డంగా నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలగడంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న సిబ్బంది క్రేన్ సహాయంతో బస్సును పక్కకు తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో బస్సులోని పలువురు భక్తులు స్వల్పంగా గాయపడ్డారు.

సోమవారం ఒక్క రోజే గంటల వ్యవధిలో పరమ పవిత్రమైన తిరుమలలో రెండు ప్రమాదాలు జరిగాయి. గతంలోనూ మెట్ల మార్గంలో కర జంతువులు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. చిరుత దడిలో ఓ చిన్నారి మృతి చెందింది కూడా. ఇలా వరుసగా ప్రమాదాలు జరగడం భక్తులకు మింగుడు పడటం లేదు.



# ఆంధ్ర

## తిరుమల పరకామణిలో బంగారు చోరీ కేసు..

### పెంచలయ్య విచారణలో షాకింగ్ విషయాలు



తిరుమల శ్రీవారి పరకామణిలో ఉద్యోగి చేతివాటం ప్రదర్శించిన సంగతి తెలిసిందే. పెంచలయ్య అనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వంద గ్రాముల బంగారం బిస్కెట్ చోరీ చేసేందుకు ప్రయత్నిస్తూ దొరికిపోయాడు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన పెంచలయ్య.. 100 గ్రాముల బంగారం బిస్కెట్ మూడో కంటికి తెలియకుండా ఎత్తుకెళు న్న సమయంలో విజిలెన్స్ సిబ్బందికి చిక్కాడు. వ్యర్థాలను తీసుకువెళ్లే ట్రాలీలో బంగారం బిస్కెట్ దాచిన పెంచలయ్య.. అక్కడి నుంచి దానిని బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేశాడు. అయితే ఈ విషయాన్ని విజిలెన్స్ సిబ్బంది పసిగట్టారు. దీంతో పెంచలయ్య అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం టీటీడీ విజిలెన్స్ సిబ్బంది తిరుమల వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పెంచలయ్యపై కేసు నమోదు చేసిన తిరుమల పోలీసులు పెంచలయ్యను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ కేసుపై దర్యాప్తు జరుపుతున్నారు.

అయితే పెంచలయ్య విచారణలో పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిసినట్లు సమాచారం. దీంతో బంగారం బిస్కెట్ దొంగతనం కేసు మరో కీలక మలుపు తిరిగింది. తిరుపతి పట్టణానికి పెంచలయ్య గత రెండేళ్ల నుంచి కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అగ్రిగోస్ కంపెనీ ద్వారా శ్రీవారి పరకామణిలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో పెంచలయ్య ఇప్పటికే బంగారు వస్తువులు చోరీ చేసినట్లు విచారణలో తెలిసింది. తిరుమల శ్రీవారి పరకామణిలోని గోల్డ్ స్టోరేజీ గదిలోని బంగారాన్ని పెంచలయ్య చోరీ చేసినట్లు సమాచారం. పెంచలయ్య తీరుపై అనుమానం రావటంతోనే టీటీడీ విజిలెన్స్ సిబ్బంది అతనిపై నిఘా పెట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే వంద గ్రాముల బంగారాన్ని పరకామణి దాటిస్తూ దొరికిపోయాడు పెంచలయ్య.

అలాగే విచారణ సందర్భంగా శ్రీవారి పరకామణిలో పెంచలయ్య ఇప్పటి వరకూ చేసిన చోరీల సంగతి వెలుగులోకి వచ్చింది. దీంతో పెంచలయ్య దగ్గర నుంచి తిరుమల వన్ టౌన్ పోలీసులు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పెంచలయ్య వద్ద నుంచి 555 గ్రాముల బంగారు బిస్కెట్‌లు. వంద గ్రాముల బంగారు ఆభరణాలు, 157 గ్రాముల వెండిని తిరుమల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారుగా 46 లక్షల వరకూ ఉంటుందని సమాచారం. దీంతో పెంచలయ్య చోరీ చేయడం ఇదే మొదటిసారి కాదని.. గతంలోనూ అతను దొంగతనం చేసినట్లు తెలిసింది.

## అత్తారింటికి వచ్చిన అల్లుడికి

# అదిరిపోయే విందు..

### 500 వంటకాలతో.. గోదారోళ్లా మజాకా!



ఒకటీ, రెండు, మూడు.. ఇలా సెకనుకు ఒకటి లెక్కెట్టినా.. 500 లెక్కపెట్టడానికి 500 సెకన్లు.. అంటే రమారమీగా దాదాపు ఎనిమిదిన్నర నిమిషాలు.. ఏంటీ ఈ లెక్కలు అనుకుంటున్నారా.. ఏమీ లేదండి.. సంక్రాంతి పండగ మొదలైంది. కొత్త అల్లుళ్లు, కొత్త కోడళ్లు, బంధుమిత్రులు, పిండి వంటలు, కోడి పందేలు.. అబ్బో ఈ హడావిడి మామూలుగా ఉండదు. పట్నం మొత్తం పల్లెకు తరలిపోయింది. అలా తరలి వచ్చిన బంధుమిత్రులకు మర్యాదలేంటో చూపిస్తున్నాయి గోదారి పల్లెలు. అన్నట్టు గోదారోళ్ల మాటలకే కాదు మర్యాదలకు ఓ ప్రత్యేకత ఉంటుందనేది అందరికీ తెలిసిన విషయమే. మాటలతో ఆకట్టుకోవటమే కాదు.. మర్యాదలతో కట్టిపడేయటంలోనూ గోదారోళ్లు సిద్ధహస్తులు. ఇక కొత్త అల్లుడికి మర్యాదలంటే చెప్పక్కర్లేదు..

ఇందాక మనం లెక్కెట్టిన నంబర్లవే.. ఒకటీ రెండు కాదు ఏకంగా 500 రకాల వంటలతో కొత్త అల్లుడికి స్వాగతం పలికిందో కుటుంబం. యానాం వర్తక సంఘం అధ్యక్షుడు మాజేటి సత్య భాస్కర్, వెంకటేశ్వరి దంపతులకు ఏకై కుమార్తె. పేరు హరిణ్య.. హరిణ్యకు గతేడాది ఘనంగా పెళ్లి జరిపించారు. విజయవాడకు చెందిన సాకేత్‌తో హరిణ్య పెళ్లి జరిగింది. సంక్రాంతి పండుగ రావటంతో కొత్త అల్లుడికి సత్య భాస్కర్ కుటుంబం పండుగకు ఆహ్వానించింది. అల్లుడు ఇంటికి వచ్చిన సందర్భంగా 500 రకాల వంటకాలతో ప్రత్యేక విందు ఏర్పాటు చేసింది.

స్వీట్లు, ఫ్రూట్లు, డ్రైఫ్రూట్స్, కూల్ డ్రింక్స్, పిండి వంటలు, శాకాహార వంటలు ఇలా మొత్తం 500 రకాల పదార్థాలు చిన్న చిన్న కప్పులలో ఉంచి.. విందు ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ టేబుల్ మీద అందంగా అమర్చి కూతురూ అల్లుడిని ఇంటికి ఆహ్వానించారు. విందులో ఇన్ని వంటకాలు చూసి అల్లుడి గారికి మతిపోయింది. వంటకాలను చూసి సాకేత్ ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆ తర్వాత తీరిగ్గా ఒక్కొక్కటీ ఆరగించే పనిలో పడ్డారు.

అల్లుడు వస్తున్నాడంటే మర్యాద ఉంటుందని ఊహించానని.. కానీ ఇన్ని వంటకాలతో ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తారని ఊహించలేదన్నారు. శాకాహారంలో ఇన్ని రకాల ఉంటాయని ఇప్పుడే తెలిసిందంటూ అత్త గారి మర్యాదకు ఉబ్బితబ్బిబ్బయ్యారు. మరోవైపు తమది ఉమ్మడి కుటుంబమన్న సత్యభాస్కర్.. మొదటి పండగకు వచ్చే కొత్త అల్లుడికి ఇలా ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తుంటామన్నారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.



# విశాఖ ఎయిర్‌పోర్టులో నూతన సేవలు

## మూడు వారాల్లోగా రెడీ

## ఎన్నాళ్లకెన్నాళ్లకు!



అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా తీర్చిదిద్దుతున్న ఏపీ ప్రభుత్వం.. విశాఖపట్నం అభివృద్ధిపైనా దృష్టి సారించింది. విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దుతామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే చాలా సార్లు ప్రకటించారు. దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబయి ఎలా మారిందో.. అదే తరహాలో ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖను మారుస్తామని చంద్రబాబు ఇటీవలే మరోసారి స్పష్టం చేశారు. ఆ దిశగానే విశాఖపట్నంలో గూగుల్, లులూ వంటి అంతర్జాతీయ సంస్థలను పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ ప్రభుత్వం ఒప్పించింది. తాజాగా విశాఖపట్నం పారిశ్రామిక అభివృద్ధిలో కీలక అడుగు పడింది. విశాఖపట్నం నుంచి దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ఫార్మా ఉత్పత్తుల రవాణాకు త్వరలోనే మార్గం సుగమం కానుంది.

2019-20 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి సుమారుగా 470 టన్నుల అంతర్జాతీయ కార్గో రవాణా జరిగినట్లు లెక్కలు చెప్తున్నాయి. అయితే ఆ తర్వాతి కాలంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు నిలిచిపోయాయి. వీటికి కూడా పలు కారణాలు ఉన్నాయి. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ నిబంధనల ఉల్లంఘన కారణంతో విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు నిలిచిపోయాయి. దీంతో ఏదైనా సరుకును ఎగుమతి చేయాలంటే ఇక్కడి పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరుకును ఎగుమతి చేయాలంటే చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటిచోట్లకు రోడ్డు మార్గంలో తీసుకెళు న్నారు. అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

అయితే ఈ సమస్యలకు చెక్ పెట్టే దిశగా కీలక అడుగు పడింది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు మొదలుపెట్టనున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది, రెండేళ్లపాటు ఏపీటీపీసీ కార్గో నిర్వహణ చేపట్టేందుకు ముందుకొచ్చింది. సరుకు తనిఖీల దగ్గర నుంచి లోడింగ్, అన్ లోడింగ్ వరూ అన్నింటి ఖర్చులను ఏపీటీపీసీ భరిస్తుంది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ నుంచి అనుమతులు తీసుకుని.. మూడు వారాల్లో సేవలు ప్రారంభించనున్నారు. దీంతో పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సంక్రాంతి పండుగపూట ఏపీ సర్కార్ కీలక నిర్ణయం..

# ఐదుగురు ఐపీఎస్‌ల బదిలీ




సంక్రాంతి పండుగ వేళ ఏపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2021-22 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఏపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం నాడు ఉత్వర్వులు జారీ చేసింది. చింతపల్లి ఏఎస్పీగా నవజ్యోతి మిశ్రా, నంద్యాల ఏఎస్పీగా మందా జావళి ఆల్ఫోన్‌కు పోస్టింగ్ ఇస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే,, రాజంపేట ఏఎస్పీగా మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, కాకినాడ ఏఎస్పీగా దేవరాజ్ మనీశ్, తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్‌కుమార్ చౌదరిను బదిలీ చేసింది.

# శ్రీశైల మల్లికార్జున స్వామి క్షేత్రంలో

## కనుల పండువగా భోగి వేడుకలు



శ్రీశైలం : భ్రమరాంబ మల్లికార్జున క్షేత్రంలో సోమవారం భోగిమంటలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయ మహాద్వారం ఎదురుగా గంగాధర మండపం కార్యక్రమాన్ని జరిపారు. ఈవో శ్రీనివాసరావు దంపతులు, ప్రధాన అర్చకులు హెచ్ వీరయ్య, అర్చకులు, ఆలయ పర్యవేక్షకులు హరియనాయక్, భద్రతా విభాగం పర్యవేక్షకులు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్చకస్వాములు, వేదపండితులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా పిడకలు, ఎండుగడ్డి, వంటచెరుకుని వేసి భోగి మంటలు వేశారు. సంక్రాంతి సందర్భంగా వేసే భోగిమంటలకు మన సంప్రదాయంలో ఎంతో విశిష్టత ఉన్నది. భోగిమంటలతో అమంగళాలు తొలగి సకలశుభాలు కలుగుతాయని పండితులు పేర్కొన్నారు. సంస్కృతి సంప్రదాయాలపై అందరికీ మరింత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏటా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భోగిమంటలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాసంలో సంక్రాంతి వేడుకలు
## హాజరైన ప్రధాని మోదీ, మెగాస్టార్ చిరంజీవి



తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి.. మూడు రోజుల సంక్రాంతి వేడుకల్లో భాగంగా.. భోగి మంటలతో పండుగ ప్రారంభమైంది.. పల్లెలతోపాటు.. పట్టణంలో ప్రజలు భోగి మంటలు వేసుకుని వేడుకలను మొదలు పెట్టారు. ప్రతి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులతో అలంకరించారు. ఈ క్రమంలో సోమవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీ నివాసంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ, మెగాస్టార్ చిరంజీవి పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా.. సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి.. వేడుకల్లో భాగంగా ఆయన ఇంటి ప్రాంగణాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. అతిథులకు రుచి చూపించేందుకు పలు రకాల సంప్రదాయ వంటకాలను సిద్ధం చేశారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి వేడుకలు జరుగుతున్నాయి.

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ శకావత్, జ్యోతి రాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, సతీష్ చంద్ర దూబే ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఇక ఎంపీలు లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, లక్ష్మణ్, గోడెం నగేష్, బాలశౌరి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణతో పలువురు తెలంగాణ బీజేపీ నేతలు కిషన్ రెడ్డి ఇంట జరుగుతున్న సంక్రాంతి వేడులకు హాజరయ్యారు.





# సర్వేలో నిరుపేదలను గుర్తించడం ఎలా?

## సామాజిక కార్యకర్త కర్ర రాజేశ్వర్ రెడ్డి



వరంగల్, 13 జనవరి (క్రాంతిన్యూస్ ): ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజాపాలన మాది ప్రజలసంక్షేమమే మాధ్యేయం అన్నకాంగ్రెస్. సర్వేల పేరుతో, కమిటీల పేరుతో కాలయాపన ఎందుకు ఇందిరమ్మ ఇండ్లు నిలువ నీడ పేదవాడికి కల్పించండి. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీలలో భాగంగా ఇందిరమ్మఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికకొరకై నిర్వహించిన ఇంటింటి సర్వేలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపులపై సర్వే ఆధారంగా నిరుపేదలకు ఇండ్లు లభించేనా? అసలు నిరుపేదలు ఎవరు? వారిని ఎలా గుర్తిస్తారు. గుర్తించేవారు అధికారులా,రాజకీయ నాయకుల అనేఅంశం ప్రజల్లో అంతుచిక్కని విషయంగా మిగిలిపోయింది .క్రైటీరియా: పేద ,నిరుపేదలు అనేవారు రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, వ్యవసాయ భూమి ,సంవత్సర నికరఆదాయం, వారిస్థితిగతులు,అనారోగ్య పరిస్థితులను, ఖర్చులను అంచనావేస్తూగుర్తించాలి.సర్వేలో అధికారులే భాగస్వాములు. సర్వేఅనంతరం ఇందిరమ్మ ఇండ్లకమిటీ ఒకపార్టీకి సంబంధించినది ఒక ఎమ్మెల్యేకు సపోర్టర్స్ వీరే లబ్ధికొరకు ఆశిస్తున్నారని పైరవీలకు పాల్పడే అవకాశం ఉందని ప్రజలఅభిప్రాయం. ప్రజల ద్వారా గ్రామాల్లో నానుడి. సభ్యులు పక్షపాతం వహించకుండా, జాతికుల మతాలకు తావు నివ్వకుండా సామాజిక స్ఫూర్తితో రాజకీయానికి అతీతంగా పనిచేయాల్సిన సందర్భం. ప్రభుత్వ ఏర్పాటుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉంది అనేది గమనించాలి ప్రజా హక్కులు దృష్టిలో పెట్టుకొని అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలి చీమలదండు, తేనెటీగల కథలను గుర్తు చేసుకుందాం, ఈ కథలలోని నీతి, ఐక్యత,స్వభావం, పట్టుదల, కార్యదీక్షత నెరవేరే అంతవరకు పడిన శ్రమ,ఆలోచనవిధానం గెలుపు, నిదర్శనం, గుర్తు చేసుకోండి పేదవాడి తెగింపు. అన్యాయం జరుగుతున్న వేళ న్యాయం కోసం పోరాటం చేస్తూ ఎన్నోసార్లు గెలుపు ఓటములను ఆత్మ పరిశీలన చేసుకుంటూ ఎవరికి లొంగక, కృంగక, హార్దిక వెసులుబాటు చేసుకుంటూ, ప్రభుత్వం నాకు ఏమీ ఇచ్చింది ప్రభుత్వానికి నేను ఏమీ ఇవ్వగలను అనే భావనతో తనదైన ఓటును ఇచ్చి సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవాలనుకుంటాడు. కానీ అలాంటి వాడికి ద్రోహం చేస్తే పైన తెలిపిన నీతి కథలు నిదర్శనాన్ని ప్రదర్శించాల్సి ఉంటుంది. ప్రజా ప్రభుత్వం ప్రజల చేత ఏర్పడిన ప్రభుత్వం అని మనం చదివి ఉంటాం, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాయకులు కూడా గొప్పలు చెప్పే మాటలు ఇవే విస్మరిస్తే ప్రభుత్వాలను సైతం కూల్చినది ప్రజలే అని కూడా మనం విన్నాం, ఈ విషయాలను గమనించి చూస్తే భారత రాజ్యాంగంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పొందుపరిచిన విషయాలలో ఓటు హక్కు ఎంత ప్రాధాన్యమో అర్థం చేసుకోండి. అర్హులకు పేదలకే ఇంద్రమ్మ ఇండ్లకు ప్రాధాన్యత ఇవ్వండి. పేదవారికి కూడు, గూడు, విద్య,వైద్యం, ఉద్యోగం, అవసరాలు. వీటికి ఎవరూ అవాంతరం కల్పించిన విశ్లేషణ చేస్తూ తను పేదవాడినని మరిచి, పేదవాడికి సాయం చేసే విధంగా బలోపేతమై తను సైతం ఒక రాజకీయ నాయకుడిగా రాటు తేలి నిత్యం పోరాడుతూనే ఉంటాడు. ఒకనాడు గెలుపు తనను వరిస్తుంది. అందుకే ఆ అవకాశంఇవ్వకుండా నిజాయితీగా నిష్పక్షపాతంగా రాజకీయం చేయండి. నిజమైన పేదలను గుర్తించండి వారికి అవకాశం ఇవ్వండి రాజకీయం చేయవద్దు.

# భోగిపండ్ల ప్రాముఖ్యం
## -నోముల విశిష్టత సమూహం సంక్రాంతి



హన్మకొండ, 13 జనవరి (క్రాంతిన్యూస్ ): హన్మకొండజిల్లా బాలసముద్రంలోనిసాయిప్రకాశ్ అపార్ట్మెంట్ లో సంక్రాంతి పర్వదిన వేడుకల్లో భాగమైన భోగి ని అత్యంత వేడుకగా నిర్వహించారు. భోగి మంటలువేసి, చిన్నారులతో పెద్దలు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సంప్రదాయ వేడుకయిన భోగి పర్వదినాన్ని ప్రాశస్త్యాన్ని చిన్నారులకు వివరించారు. భోగిపండ్ల ప్రాముఖ్యం, సంక్రాంతి నోముల విశిష్టతలనుస్మరించుకున్నారుచిన్నారులతో కలసి మహిళలు కోలాటం,సంప్రదాయ సంగీత కచేరి ఆందోత్సహాన్ని నింపింది. అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ కమిటీఅధ్యక్షుడు టి రవీందర్ రెడ్డి,కోశాధికారి నరేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపి చిన్నారులనుఅభినందించారుచిన్నారులు రంగులతో ముగ్గులుచేసి అపార్ట్మెంట్ ను అందంగా ముస్తాబుచేశారు. భోగి మంటలవేడుకల్లో ప్రభుత్వ సంగీత ఉపాద్యాయురాలు వద్దిరాజు నివేదిత, రిటైర్డ్ హెచ్ఎం లు కె యాదగిరి,గంగు ఉషారాణి, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ పి నమ్రత,హెడ్ ఫాకల్టీ ఇన్ హెూటల్ మేనేజ్మెంట్ సిందూరి స్వరూప్, బిఎస్ఎన్ఎల్ ఏఈహన్మంతరావు అపార్ట్మెంట్ ఈసి మెంబర్ సారిక, హరిత, సరితా, శ్రీజ, అపూర్వ, వికాస్ తోపాటు అపార్ట్మెంట్ వాసులు పాల్గొని వేడుక జరుపుకున్నారు.

# లాస్ ఏంజిల్స్‌లో కార్చిచ్చు..
## మంటల్లో బూడిదైన హాలీవుడ్ తారల ఆస్తులు..
## రూ.12929329155000 కోట్ల నష్టం



అమెరికాలోని కాలిఫోర్నియాలో గల లాస్ ఏంజిలిస్ నగరాన్ని కార్చిచ్చు చుట్టుముట్టింది. అనేక అడవుల్లో వ్యాపించిన మంటలు నివాస ప్రాంతాలను ఆక్రమించుకుంటున్నాయి. ఈ మంటలు హాలీవుడ్ హిల్స్‌కు చేరాయి. ప్రపంచంలోని అనేక పెద్ద ప్రొడక్షన్ హౌస్‌ల స్టూడియోలు ఈ కొండలపై ఉన్నాయి. చాలా మంది హాలీవుడ్ తారలకు కూడా ఈ స్థలంలో ఇళ్లు ఉన్నాయి. కార్చిచ్చు కారణంగా దాదాపు 60 బిలియన్ల (సుమారు రూ.5 లక్షల కోట్లు) ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో 10 మంది చనిపోయినట్టుగా తెలిసింది.. లక్షమందిని పునరావాస కేంద్రాలకు తరలించారు.

హాలీవుడ్ చిత్ర పరిశ్రమ ఇక్కడే ఉండటంతో పలు చిత్రాల షూటింగ్స్ వాయిదాపడ్డాయి. చాలా మంది హాలీవుడ్ తారల బంగ్లాలు కాలి బూడిదయ్యాయి. పారిస్ హిల్టన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్, మాండీ మూర్, అష్టన్ కుచర్‌తో సహా పలువురు హాలీవుడ్ స్టార్ల ఆస్తులకు నిప్పంటుకున్నట్టుగా సమాచారం. అగ్నిప్రమాదం తర్వాత చాలా మంది సెలబ్రిటీలు తమ ఇళ్లను ఖాళీ చేయవలసి వచ్చింది. ఇదొక్కటే కాదు, బ్రెట్టన్‌వుడ్ ప్రాంతంలో నిర్మించిన ఉపాధ్యక్షుడు కమలా హారిస్ ఇంటిని కూడా ఖాళీ చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఇదిలా ఉంటే, కార్చిచ్చు సమాచారంతో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన ఇటలీ పర్యటనను రద్దు చేసుకొని సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

మంగళవారం నాడు చెలరేగిన అగ్నిప్రమాదానికి ఇప్పటి వరకు 3 రోజుల్లో 28 వేల ఎకరాలు దెబ్బతిన్నాయి. దాదాపు 1900 భవనాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. 28 వేల ఇళ్లు దెబ్బతిన్నాయి. హెలికాప్టర్లు, విమానాలతో కాలిఫోర్నియాలో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఈదురు గాలుల కారణంగా మంటలు ఎటువైపులా వ్యాపిస్తున్నాయి. దాదాపు 7500 మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్నారు.

### చరిత్ర చూడని విధ్వంసం

అమెరికాలోని కాలిఫోర్నియాలో కార్చిచ్చు కొనసాగుతోంది. లాస్ ఏంజిల్స్‌లోని అడవిలో జరిగిన అగ్నిప్రమాద దృశ్యాన్ని ప్రపంచం మొత్తం చూస్తోంది. ఈ కార్చిచ్చులో లాస్ ఏంజిల్స్ పూర్తిగా ధ్వంసమైనట్లు కనిపిస్తోంది. ఈ రోజు వరకు, లాస్ ఏంజిల్స్‌లో 12 వేలకు పైగా గృహాలు, భవనాలు పూర్తిగా నాశనం అయ్యాయి. ఈ అగ్ని ప్రమాదంలో ఇప్పటి వరకు 11 మంది చనిపోయారు. లాస్ ఏంజిల్స్ అగ్నిప్రమాద వినాశనం ఎప్పుడు ముగుస్తుందో చెప్పడం కష్టం.

గత మంగళవారం కార్చచ్చు మొదలైంది. అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నా సరే ఇది ఇంకా పూర్తిగా నియంత్రణలోని రాలేదు. మంగళవారం అడవిలో మంటలు చెలరేగాయి. కానీ శాంటా అనా గాలులు దానిని మరింత భయంకరంగా మార్చాయి. గురువారం మంటలు అదుపులోకి వచ్చాయి.



అయితే వారాంతంలో మంటలు మళ్లీ తీవ్రమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ అగ్నిప్రమాదం వల్ల అమెరికాకు ఎంత నష్టం వాటిల్లిందో అంచనా వేయడం కష్టం.

### ఇంత విధ్వంసం అమెరికా మునుపెన్నడూ చూడలేదు!

అమెరికా చరిత్రలో ఇది అత్యంత ఘోరమైన అగ్ని ప్రమాదంగా భావిస్తున్నారు. ఇప్పటి వరకు ఏ అగ్ని ప్రమాదంలో అమెరికా ఇంతగా నష్టపోలేదు. ఎంతమేరా నష్టం వాటిల్లిందో ఇంకా స్పష్టంగా తెలియలేదు. వాతావరణ డేటాను అందించే ప్రైవేట్ సంస్థ అక్యూవెదర్, నష్టం %వి%150 బిలియన్ల వరకు ఉంటుందని అంచనా వేసింది. మనం భారతీయ కరెన్సీలో మాట్లాడినట్లయితే ఈ నష్టం దాదాపు 1,29,29,32,91,55,000 (150 బిలియన్ డాలర్లు) ఉంటుంది. అయితే నష్టంపై ప్రభుత్వ అధికారులు ఇంకా అంచనా వేయలేదు.

### అంచనా నష్టం ఎంత?

దాదాపు 150 బిలియన్ డాలర్లు అంటే 1,29,29,32,91,55,000 రూపాయలు

### ఎన్ని ఇళ్లు, భవనాలు ధ్వంసమయ్యాయి?

మొత్తం 12 వేలకు పైగా ఇళ్లు, భవనాలు ధ్వంసమయ్యాయి. పసిఫిక్ పాలిసేడ్స్‌లోని పర్వత తీర ప్రాంతంలో 5,300 కంటే ఎక్కువ భవనాలు దెబ్బతిన్నాయి లేదా ధ్వంసమయ్యాయి. వీటిలో జామీ లీ కర్టిస్ మరియు బిల్లీ క్రిస్టల్ వంటి ప్రముఖుల గృహాలు ఉన్నాయి. ఉత్తర పసాదేనాలో 7,000కు పైగా భవనాలు కాలి బూడిదయ్యాయి. వీటిలో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు లేదా వాణిజ్య భవనాలు మరియు వాహనాలు ఉన్నాయి.

### ఎంతమందికి కష్టాలు పెరిగాయి?

అగ్ని ప్రమాదం కారణంగా 1.7 కోట్ల మంది ప్రభావితం అయ్యారు. ఆకాశంలో దట్టమైన పొగ, బూడిద మేఘాల కారణంగా, దక్షిణ కాలిఫోర్నియాలోని 17 మిలియన్ల మంది ప్రజలు గాలి నాణ్యత, దూళి కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.



### విస్తృతంగా విద్యుత్తు అంతరాయాలు

దక్షిణ కాలిఫోర్నియాలో, 175,000 కంటే ఎక్కువ గృహాలకు విద్యుత్తు లేదు. వీరిలో దాదాపు సగం మంది లాస్ ఏంజెల్స్ కౌంటీకి చెందిన వారు.



KR TV క్రాంతి


# ఆరోగ్య క్రాంతి

## చలికాలంలో ఇవి తింటే బాడీలో యూరిక్ యాసిడ్ పెరుగుతుంది..

హెల్త్ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ):అసలే చలికాలం.. రోజు రోజుకి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలికాలంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చలికాలంలో కొన్ని రోగాల బారిన పడే ప్రమాదముంది. అంతేకాకుండా అనారోగ్య సమస్యలతో బాధపడేవారు చలికాలంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ సీజన్‌లో మీ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదముంది. ఇక, ఈ చల్లటి వాతావరణంలో యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. లేదంటే వారి సమస్యలు తీవ్రమవుతాయి.

ఈ రోజుల్లో అధిక యూరిక్ యాసిడ్ ప్రధాన సమస్యగా మారింది. రోజూ తీసుకునే ఫుడ్, డ్రింక్స్‌లో ఉండే ప్యూరిన్స్ అనే రసాయనాల్ని శరీరం విచ్ఛిన్నం చేసినప్పుడు యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. ఈ వ్యాధి ప్రధాన లక్షణాల్లో కీళ్ల నొప్పులు ముందు వరుసలో ఉంటుంది. యూరిక్ యాసిడ్ స్థాయి 7.0 mg/dl కంటే ఎక్కువగా ఉన్నప్పుడు అది కీళ్లలో స్ఫటికాల రూపంలో పేరుకుపోతుంది. దీంతో కీళ్లల్లో నొప్పి, వాపు కలుగుతుంది. ఈ సమస్య ఉన్నవారు ఆహారం పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. చలికాలంలో కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలి. ఆ లిస్ట్ ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.

మద్యం: ఆల్కహాల్, ముఖ్యంగా బీర్ అధిక సాంద్రత కలిగి ఉంటాయి. ఇవి తాగితే యూరిక్ యాసిడ్ స్థాయిలు అధికంగా పెరుగుతాయి. ఆల్కహాల్ శరీరం నుంచి యూరిక్ యాసిడ్ యొక్క తొలగింపును నిరోధిస్తుంది. అంతేకాకుండా శరీరంలో దాని స్థాయిలను పెంచుతుంది. ఆల్కహాల్ తాగడం వల్ల కాలేయం డ్యామేజ్ అయ్యే ప్రమాదముంది. అంతేకాకుండా ఆల్కహాల్ ఎక్కువ తాగడం వల్ల యూరిక్ యాసిడ్ స్ఫటికాల రూపంలో కీళ్లలో పేరుకుపోయే ప్రమాదముంది. దీంతో.. కీళ్ల నొప్పుల సమస్య వస్తుంది.

ఫ్రక్టోజ్ డ్రింక్స్..సోడా, జ్యూస్, స్పోర్ట్స్ డ్రింక్స్ మొదలైన ఫ్రక్టోజ్ డ్రింక్స్ యూరిక్ యాసిడ్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. ఫ్రక్టోజ్ అనేది అనేక పండ్లలో కనిపించే ఒక రకమైన చక్కెర. కానీ ప్రాసెస్ చేసిన ఆహారాలు, పానీయాలకు దీనిని జోడించినప్పుడు, అది యూరిక్ యాసిడ్ స్థాయిలను పెంచుతుంది. అందుకే సోడాలు, కూల్ డ్రింక్స్, ప్యాకేజ్డ్ జ్యూసులు ఎక్కువగా తాగకూడదు.

రెడ్ మీట్..

– యూరిక్ సమస్య ఉన్నవారు రెడ్ మీట్ ఎక్కువగా తినకూడదు. ముఖ్యంగా ప్యూరిన్స్ ఎక్కువగా ఉండే గొర్రె, మేక, బీఫ్ వంటి వాటికి దూరంగా ఉండాలి. అలాగే చాలా మంది లివర్, బోటి తింటుంటారు. వీటిని కూడా తినకూడదని నిపుణులు చెబుతున్నారు. వీటని తినడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ లెవల్స్ బాగా పెరిగే అవకాశం ఉంది.

ఎనర్జీ డ్రింక్స్..

ఈ ఎనర్జీ డ్రింక్స్ అధిక మొత్తంలో చక్కెర, కృత్రిమ స్వీటెనర్లను కలిగి ఉంటాయి. వీటిని తాగడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరుగుతాయి. దీంతో.. కీళ్ల నొప్పుల సమస్య, కిడ్నీలో రాళ్ల సమస్యలు పెరుగుతాయి. ఈ డ్రింక్స్‌తో పాటు ప్యూరిన్ అధికంగా ఉండే కొన్ని ఆహారాలకు కూడా దూరంగా ఉండాలి. తేనె, స్వీట్స్, రెడ్ మీట్, పప్పులు వంటివి రాత్రి పూట తినకూడదు.

వీటిని కూడా తినకూడదు..

NHI నివేదిక ప్రకారం, ఆస్పరాగస్ పాలకూర, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, చిక్కుళ్లు, వివిధ రకాల బీన్స్, పుట్టగొడుగులలో ప్యూరిన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడేవారు.. ప్యూరిన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే.. పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది. అందుకే వీటిని ఎక్కువగా తినకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

యూరిక్ యాసిడ్ తగ్గాలంటే..

- యూరిక్ యాసిడ్ తగ్గడం కోసం పుష్కలంగా నీరు తాగాలి. నీరు తాగడం వల్ల మూత్రపిండాలు శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగిస్తాయి.
- యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచడంలో ఊబకాయం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందుకే బరువు తగ్గించుకోవడానికి ప్రయత్నించండి.
- శరీరం నుంచి యూరిక్ యాసిడ్ తొలగించడంలో వ్యాయామం సహాయపడుతుంది.
- శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు ఎక్కువై.. కీళ్ల నొప్పులు వస్తే వైద్యుణ్ని సంప్రదించండి.



## బ్రెయిన్ స్ట్రోక్ రాకూడదంటే వీటిని కచ్చితంగా పాటించాలట



హెల్త్ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ):బ్రెయిన్‌లో ఏదైనా భాగానికి తగినంత రక్త ప్రసరణ లేనప్పుడు బ్రెయిన్ స్ట్రోక్ అనే ప్రమాద సమస్య వస్తుంది. సరైన రక్త సరఫరా జరగకపోతే మెదడు కణాలు ఆక్సీజన్ లేకుండా చనిపోతాయి. ఇది తీవ్ర పరిణామలకు దారి తీస్తుంది. ఈ సమస్యకి ఎంత త్వరగా ట్రీట్‌మెంట్ చేస్తే అంత త్వరగా ఎలాంటి వైకల్యం రాకుండానే కోలుకుంటారు. అయితే, ఇంతటి ప్రమాదకర సమస్య రాకుండా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతో సమస్యని కంట్రోల్ చేయొచ్చు. అవేంటంటే..

హెల్దీ డైట్..

మనం తీసుకునే ఆహారమే ఆరోగ్య సమస్యలు రావడానికి, ఆరోగ్యంగా ఉండడానికి ముఖ్యకారణాలు. అందుకే, మంచి హెల్దీ డైట్ తీసుకోవాలి. దీనికోసం పండ్లు, కూరగాయలు తినాలి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, బ్రెయిన్‌ని కాపాడతాయి. సంతృప్త, ట్రాన్స్ ఫ్యాట్స్ బదులు చేపలు, వాల్‌నట్స్, అవిసెల్లాంటి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ తీసుకోండి. ఉప్పు, చక్కెరని తగ్గించండి. దీని వల్ల బరువు పెరగరు. షుగర్, బ్రెయిన్ స్ట్రోక్ వంటి సమస్యలు రావు.

బరువు తగ్గడం..

బరువు ఎక్కువగా ఉండడం వల్ల కూడా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, మీ వయసు, ఎత్తుని బట్టి మీరు ఉండాల్సిన బరువునే మెంటెయిన్ చేయండి. దీనికోసం రెగ్యులర్‌గా వర్కౌట్ చేయడం, మంచి డైట్ తీసుకోవాలి.

బీపిని కంట్రోల్ చేయడం..

బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి ముఖ్యకారణాల్లో ఒకటి బ్లడ్ ప్రెజర్ పెరగడం. ఆడ, మగవారిలో.. ఎవరిలోనైనా బీపి పెరిగితే వారికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ఈ బ్రెయిన్ స్ట్రోక్ రాకుండా ఉండేందుకు బీపిని ఎప్పటికప్పుడు కంట్రోల్‌లో ఉంచుకోవాలి. దీనికోసం ఎప్పటికప్పుడు బీపి చెక్ చేసుకోవాలి. దీనికోసం ఉప్పుని తగ్గించడం, హై కొలెస్ట్రాల్ ఫుడ్స్, బర్గర్స్, చీజ్, ఐస్ క్రీమ్స్ వంటి వాటిని తగ్గించాలి. దీంతో పాటు తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. వారానికి రెండుసార్లైన చేపలు తినాలి. లో ఫ్యాట్ డెయిరీ తీసుకుంటూ హెూల్ గ్రెయిన్స్‌ని డైట్‌లో చేర్చుకోవాలి. దీంతో పాటు రోజుకి 30 నిమిషాల వర్కౌట్ చేస్తూ ఆల్కహాల్, స్మోకింగ్‌కి దూరంగా ఉండాలి.

స్ట్రెస్ తగ్గించుకోవడం..

ఎక్కువగా స్ట్రెస్, ఒత్తిడి కారణంగా బ్రెయిన్, గుండెకి మంచిది కాదు. అనేక మందికి చాలా ఇంటి, ఆఫీస్ పనుల వల్ల ఒత్తిడి పెరుగుతుంది. అలాంటి స్ట్రెస్‌ని దూరం చేసుకోవాలి. దీనికోసం ప్రాణాయామం, ధ్యానం వంటివి చేయొచ్చు. వీటితో పాటు మ్యూజిక్, గార్డెనింగ్, పెయింటింగ్, డ్యాన్స్ వంటి ఇష్టమైన పనులు చేయండి. దీని వల్ల హ్యాపీగా ఉంటారు. ఒత్తిడి తగ్గుతుంది. మంచిగా నిద్ర కూడా పడుతుంది. దీంతో బ్రెయిన్ స్ట్రోక్ వంటి సమస్యల నుంచి తప్పించుకోవచ్చు

ఆల్కహాల్‌కి దూరంగా..

అదే విధంగా, ఆల్కహాల్ తీసుకుంటే దానిని తగ్గించాలి. ఒకేసారి ఎక్కువగా తీసుకోవద్దు. మెల్లిమెల్లిగా ఆల్కహాల్‌ని తగ్గించాలి. దీనికోసం రోజుకి కొద్దికొద్దిగా ఆల్కహాల్‌ని తగ్గిస్తూ తీసుకోండి. దీని వల్ల కూడా చాలా ఆరోగ్య సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. అదే విధంగా, స్మోకింగ్ కూడా.. స్మోకింగ్ వల్ల కూడా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే రిస్క్ ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా ఇతర సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి, మెల్లిమెల్లిగా స్మోకింగ్ అలవాటుని దూరం చేసుకోవాలి.

# విరాట్‌కు పాక్‌తో మ్యాచ్ ఉందని చెప్పండి..! షోయబ్ అక్తర్ సూచన..!

స్పోర్ట్స్ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ): భారత జట్టు స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ గత కొద్దికాలంగా ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్నాడు. ఇటీవల ముగిసిన బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లోనూ చెత్త ఫామ్‌తో విమర్శల పాలయ్యాడు. ఆ తర్వాత టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ తీసుకుంటాడని ప్రచారం జరుగుతున్నది.




టీమిండియా త్వరలోనే ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ ఆడనున్నది. ఆ తర్వాత చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు దుబాయికి వెళ్తుంది. వన్డే సిరీస్‌తో విరాట్ మళ్లీ ఫామ్‌లోకి వస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, కోహ్లీకి పాకిస్థాన్ మాజీ బౌలర్ అక్తర్ కీలక సూచనలు చేశాడు. మళ్లీ బ్యాట్ పరుగుల వరద ఎలా పారించగలడో చెప్పాడు.చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న ప్రారంభం కానున్నది. భారత్, పాకిస్థాన్ గ్రూప్-ఏలో ఉన్నాయి. దుబాయి వేదికగా ఫిబ్రవరి 23న రెండు జట్ల మధ్య మ్యాచ్ జరుగనున్నది. అక్తర్ మాట్లాడుతూ.. విరాట్ కోహ్లీ తిరిగి ఫామ్‌లోకి రావాలనుకుంటే.. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఉందని చెప్పాలని సూచించాడు. పాకిస్థాన్‌పై విరాట్ చెలరేగి ఆడిన విషయాన్ని గుర్తు చేశాడు. మెల్‌బోర్న్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడని.. మళ్లీ బ్యాట్‌తో రాణిస్తాడని షోయబ్ తెలిపాడు. పాకిస్థాన్‌పై వన్డేల్లో విరాట్‌కు మంచి రికార్డే ఉన్నది. 16 మ్యాచుల్లో మూడు సెంచరీలు చేసి.. 678 పరుగులు చేశాడు. టీ20 ఫార్మాట్‌లో పాకిస్తాన్‌పై కోహ్లీ అత్యధిక పరుగులు చేశాడు. 70.28 సగటుతో 492 పరుగులు చేశాడు. ఇటీవల ముగిసిన ఆస్ట్రేలియా పర్యటనలో పెర్త్ టెస్ట్‌లో మినహా మిగతా మ్యాచుల్లో రాణించలేకపోయాడు. ఐదు మ్యాచ్‌ల్లో తొమ్మిది ఇన్నింగ్స్‌లలో అతను 190 పరుగులు మాత్రమే చేశాడు.

భారత్-పాక్ పోటీపై..

టీమిండియా, భారత్ పాకిస్థాన్ మధ్య గట్టి పోటీ ఉంటుందని అక్తర్ పేర్కొన్నాడు. దుబాయిలో జరుగబోయే మ్యాచ్‌లో రెండు జట్ల మధ్య మంచి పోటీ ఉంటుందని ఆశిస్తున్నానన్నాడు. భారత్ తరఫున విరాట్, పాక్ తరఫున బాబర్ ఆజామ్ పరుగులు.. జస్ప్రీత్ బుమ్రా, షహీన్, నసీమ్ బెస్ట్ బౌలింగ్‌ను ఊహించుకోవాలని సూచించాడు. సైమ్ అయూబ్, ఫఖార్ జమాన్ ఓపెనింగ్ చేస్తే ఇతర జట్లకు ప్రమాదకరమని పేర్కొన్నాడు. ఇద్దరు కలిసి ఆడడం చూసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపాడు. భారత్, పాక్ జట్టులో బెస్ట్ జట్టు ఏదో చెప్పాలని కోరగా.. రెండు ఇష్టమేనని చెప్పాడు.

# ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్


స్పోర్ట్స్ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ): ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ వ్యవహరించనున్నాడు. ఈ మేరకు ప్రాంచైజీ జట్టు కొత్త కెప్టెన్‌ను ప్రకటించింది.




అయ్యర్ గత సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా కొనసాగాడు. అతని కెప్టెన్సీలో కేకేఆర్ టైటిల్‌ను గెలిచింది. జెడ్డా వేదికగా ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో పంజాబ్ కింగ్స్‌ను పంజాబ్ రూ.26.75కోట్లు పోసి కొనుగోలు చేసింది. ఈ ఏడాది జరుగనున్న ఐపీఎల్‌లో పంజాబ్ అయ్యర్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్నది.


పంజాబ్ కింగ్స్ 2008 నుంచి ఐపీఎల్‌లో కొనసాగుతున్నది. 2020 వరకు ఆ జట్టుకు కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ పేరు ఉండేది. పంజాబ్ వరుసగా 17 సీజన్లలో పాల్గొనగా.. మొత్తం 16 మంది కెప్టెన్లుగా పని చేశారు. శ్రేయాస్ అయ్యర్ 17వ కెప్టెన్‌గా పనిచేయనున్నాడు. యువరాజ్ సింగ్ పంజాబ్ కింగ్స్‌కు తొలి కెప్టెన్. ఆస్ట్రేలియాకు చెందిన జార్జ్ బెయిలీ అత్యధికంగా 35 మ్యాచుల్లో జట్టుకు నాయకత్వం వహించాడు. మహేల జయవర్ధనే, వీరేంద్ర సెహ్వాగ్, జితేష్ శర్మ కెప్టెన్లుగా పని చేశారు.

# రెండు తరాల క్రికెటర్ల మధ్య పోలిక సాధ్యం కాదు.. : మాజీ కెప్టెన్ కపిల్ దేవ్



స్పోర్ట్స్ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ):టీమిండియా రెండు తరాల క్రికెటర్లను పోల్చి చూడలేమని మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నారు. ఇంగ్లాండ్‌తో జరుగనున్న ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్‌ను పక్కన పెట్టిన విషయం తెలిసిందే. దీనిపై సైతం స్పందించేందుకు నిరాకరించారు. 1991-92లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో కపిల్ దాదాపు 300 ఓవర్లు బౌలింగ్ చేశాడు. టెస్ట్ ఫార్మాట్‌లో 400 వికెట్లు తీసిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించారు. భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వెన్ను నొప్పి కారణంగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన టెస్టు సెకండ్ ఇన్నింగ్‌లో బౌలింగ్ చేయలేకపోయాడు. ఈ సిరీస్‌లో బుమ్రా 150 ఓవర్లకుపైగా 32 వికెట్లు పడగొట్టాడు. రెండు తరాల మధ్య పోలిక ఉండకూడదని.. దాంతో అవసరం లేదన్నారు. ప్రస్తుత కాలంలో ఆటగాళ్లు రోజునే 300 పరుగులు చేస్తున్నారని.. ఇది తమకాలంలో జరుగలేదని.. దాంతో రెండు తరాల ఆటగాళ్ల మధ్య పోలిక సాధ్యం కాదన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో పేలవ ఫామ్‌తో విమర్శల పాలవుతున్న కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీ భవితవ్యంపై ఊహాగానాలున్నాయి.ఇద్దరూ సీనియర్లని.. వారి భవిష్యత్‌ను వారే నిర్ణయించుకోగలరని మాజీ కెప్టెన్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో తొమ్మిది ఇన్నింగ్స్‌లో కోహ్లీ 190 పరుగులు చేయగలిగాడు. ఆఫ్ స్టంప్ ఆవల బంతిని వెంటాడుతూ పదేపదే క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. కెప్టెన్ రోహిత్ గణాంకాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. మూడు మ్యాచుల్లో ఐదు ఇన్నింగ్స్‌లో కేవలం 31 పరుగులు చేశాడు. దాంతో ఐదో టెస్టుకు దూరమయ్యాడు. రోహిత్ స్థానంలో కెప్టెన్‌గా ఎవరు రేసులో ఉంటారన్న ప్రశ్నకు సమాధానాలిచ్చారు. ఇందులో ఎలాంటి వివాదాలు ఉండకూడదని.. కెప్టెన్ ఎవరూ అయినా పూర్తి సమయం తీసుకోవాలన్నారు. ఇంగ్లాండ్‌తో జరుగనున్న టీ20 సిరీస్‌లో యశస్వి, పంత్ వంటి డాషింగ్ బ్యాట్స్‌మెన్‌లకు చోటు కల్పించకపోవడంపై స్పందిస్తూ.. మరొకరి నిర్ణయంపై తాను ఏమీ చెప్పదలచుకోలేదన్నారు. సెలెక్టర్లు కొంత ఆలోచించిన తర్వాతే జట్టును ఎంపిక చేశారని.. తాను ఏదైనా చెబితే వారిని విమర్శించడమే అవుతుందని.. తాను ఎవరినీ విమర్శించాలనుకోవడం లేదని మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ చెప్పుకొచ్చారు.

# మార్చి 21న ఐపీఎల్ ప్రారంభం




స్పోర్ట్స్ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ):ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ మార్చి 21న మొదలవనుంది. మార్చి 21 నుంచి మే 25 దాకా ఈ మెగాలీగ్‌ను నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధమైంది. ఈ మేరకు గతంలో ప్రకటించిన తేదీ(మార్చి 14) లో స్వల్ప మార్పులు చేసింది. ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌తో పాటు ఫైనల్‌నూ కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్ వేదికగా నిర్వహించనున్నట్లు సమాచారం. త్వరలోనే అధికారిక షెడ్యూల్ వెలువడనుంది. ఇక మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్).. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 2 దాకా జరుగనుంది.

# బీసీసీఐ కార్యదర్శిగా సైకియా

స్పోర్ట్స్ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ): భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శిగా దేవ్‌జిత్ సైకియా, కోశాధికారిగా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



గతంలో సెక్రటరీ పదవిని జై షా నిర్వహించగా అతడు ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికవడంతో బీసీసీఐ కార్యదర్శిగా వైదొలిగాడు. కొద్దిరోజులుగా జై షా స్థానంలో తాత్కాలిక కార్యదర్శిగా పనిచేస్తున్న సైకియా.. ఆదివారం నుంచి పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టాడు. ఈ మేరకు ముంబైలో జరిగిన బీసీసీఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యులు సైకియా, ప్రభ్‌జీత్‌ను ఏక్రగీవంగా ఎన్నుకున్నారు. సైకియా, ప్రభ్‌తేజ్‌కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. హెచ్‌సీఏ ప్రతినిధిగా హాజరై వీరి అభ్యర్థిత్వాన్ని బలపరిచిన ఆయన.. ఎన్నిక తర్వాత ప్రత్యేకంగా వారిని కలిసి తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.


KR TV మన క్రాంతి





# సినిమా న్యూస్

## బాలకృష్ణ కెరీర్ బిగ్గెస్ట్ ఓపెనింగ్..




మూవీ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ): నందమూరి బాలకృష్ణ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన డాకు మహారాజ్ థియేటర్లలో సందడి చేస్తోంది. బాబీ దర్శకత్వంలో ఎన్‌బీకే 109 గా తెరకెక్కిన ఈ మూవీ జనవరి 12న (ఆదివారం) ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాగా సూపర్ హిట్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. కాగా వరల్డ్ వైడ్‌గా ఓపెనింగ్ డేన డాకు మహారాజ్ రూ.56 కోట్లు వసూళ్లు రాబట్టింది. బాలకృష్ణ కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ ఓపెనింగ్ కావడం విశేషం.డాకు మహారాజ్ సంక్రాంతి బ్లాక్ బస్టర్లలో ఒకటిగా నిలువడం ఖాయమని తాజా ఫిగర్ క్లారిటీ ఇచ్చేస్తుంది. మరి రాబోయే రోజుల్లో బాలకృష్ణ వసూళ్ల పర్వం ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా, ప్రగ్యాజైశ్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. రోనిత్ రాయ్, శ్రద్ధా శ్రీనాథ్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషించారు.ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ బాబీ డియోల్ విలన్‌గా నటించాడు. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కించారు.

## లేగదూడతో ధనుష్..



మూవీ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ): కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడని తెలిసిందే. వీటిలో ఒకటి ధనుష్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న చిత్రం ఇడ్లీ కడై. DD4గా వస్తోన్న ఈ చిత్రాన్ని ఆకాశ్ (డెబ్యూ) తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ లుక్, ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా పొంగల్ కానుకగా స్పెషల్ పోస్టర్లను విడుదల చేశారు.ఒక పోస్టర్‌లో ధనుష్, నిత్యమీనన్ చేనులో నిలబడి వర్షంలో తడిసి ముద్దవుతుండగా.. మరో పోస్టర్‌లో తెలుపు రంగు చొక్కా, లుంగీలో మర్రి చెట్టు కింద లేగదూడను పట్టుకొని కూర్చున్నాడు. ఈ రెండు సినిమాలు సినిమా ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తూ క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. తిరు సినిమా తర్వాత ఈ ఇద్దరి కాంబోలో వస్తున్న ప్రాజెక్టు కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.ఈ మూవీలో అరుణ్ విజయ్, సత్యరాజ్, అశోక్ సెల్వన్, రాజ్‌కిరణ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ధనుష్ దీంతోపాటు శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో కుబేరలో నటిస్తుండగా.. షూటింగ్ దశలో ఉంది. ధనుష్ మరోవైపు హిందీలో రాంఝానా, అత్రాంగి రే తర్వాత ఆనంద్ ఎల్ రాయ్ డైరెక్షన్‌లో తేరే ఇష్క్ మే సినిమాను కూడా చేస్తున్నాడని తెలిసిందే.

## సినిమా అంతా నవ్వులే..



మూవీ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ):'ఇది నా 76వ సినిమా. అనిల్ రావిపూడి వండర్‌ఫుల్ స్క్రిప్ట్ ఇచ్చారు. సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. నా అభిమానులు నన్నెలా చూడాలని కోరుకుంటారో.. ఇందులో అలా కనిపిస్తా. అనిల్ ప్రతిసీన్ అద్భుతంగా తీశాడు. సినిమా అంతా నవ్వులే ఉంటాయి. నిర్మాతలు చాలా హ్యాపీగా ఉన్నారు. పనిచేసిన వారంతా ప్రాణం పెట్టి పనిచేశారు. సంక్రాంతికి వస్తున్నాం.. మీరంతా ఫ్యామిలీలతో రావాలి. మామూలుగా ఉండదు ఎంజాయిమెంట్.' అని అగ్ర హీరో వెంకటేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. సంక్రాంతి కానుకగా ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్'ని మేకర్స్ గ్రాండ్‌గా నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. 'సంక్రాంతికి వస్తున్నాం' మీరంతా కొత్తగా ఫీలయ్యే కామెడీ ఫిల్మ్. చాలా డిఫరెంట్‌గా ట్రైచేశాను. నా ఏడు సినిమాలు హిట్స్ చేశారు. ఇప్పుడు ఎనిమిదో సినిమాతో వస్తున్నా. ఇది నా కెరీర్‌లో బెస్ట్ ఎంటర్టైనర్. మరో బ్లాక్‌బస్టర్ పక్కా. వెంకటేశ్ ఒక టీచర్‌లా, ఒక ఫ్రెండ్‌లా, సడన్‌గా స్టూడెంట్‌లా, మరోవైపు పెద్దమనిషిలా అనిపిస్తారు. ఒక వ్యక్తిలో ఇన్ని క్వాలిటీస్ వుండటం నాట్ ఏ జోక్. వెంకటేష్‌గారితోపాటు పనిచేసిన అందరూ నాకు ఎనర్జీనిచ్చి ముందుకు నడిపించారు. జనవరి 14న మిస్ అవ్వద్దు. హిస్టరీలో వెంకీసార్ ఫ్యామిలీ నేపథ్యంలో వచ్చిన ప్రతి సినిమా బ్లాక్‌బస్టరే. ఇదీ అంతే..' అని అనిల్ రావిపూడి నమ్మకం వెలిబుచ్చారు. బ్లాక్‌బస్టర్ అన్నది వే.. అంటూ దిల్‌రాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మన్మథుడు హీరోయిన్ అన్షుపై హాట్ కామెంట్స్ దుమారం.



మూవీ న్యూస్,13 జనవరి (క్రాంతిన్యూస్ ): త్రినాథ రావు నక్కిన డైరెక్షన్‌లో సందీప్ కిషన్ హీరోగా నటిస్తోన్న చిత్రం మజాకా. రీతూవర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మన్మథుడు ఫేం అన్షు కీలక పాత్రలో నటిస్తోంది. కాగా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో త్రినాథరావు నక్కిన చేసిన కామెంట్స్ ఇండస్ట్రీ సర్కిల్‌లో తీవ్రదుమారం రేపాయి. ఈవెంట్‌లో త్రినాథ రావు నక్కిన మాట్లాడుతూ.. మన్మథుడు సినిమా తర్వాత అన్షు ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉందంటూ.. ఆమె ఫారిన్ నుంచి వచ్చాక సన్నగా ఉందని, కాదమ్మా తెలుగుకు సరిపోదు, కొంచెం అన్నీ ఎక్కువ సైజుల్లో ఉండాలని చెప్పా.. పర్లేదు ఇప్పుడు కొంచెం ఇంప్రూవ్ అయిందంటూ కామెంట్ చేశాడు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవడమే కాకుండా మహిళా కమిషన్ దృష్టికి కూడా వెళ్లింది.త్రినాథరావు వ్యాఖ్యలను సుమోటోగా సీక్వరించిన మహిళా కమిషన్ చైర్మన్ నేరేళ్ల శారద.. త్వరలోనే నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా త్రినాథరావు ఎక్స్ వేదికగా క్షమాపణలు తెలియజేస్తూ వీడియో విడుదల చేశాడు.అందరికీ నమస్కారం.. ముఖ్యంగా మహిళలకు, అన్షుకు.. నా మాటల వల్ల బాధపడ్డ ఆడవాళ్లందరికీ నా క్షమాపణలు తెలియజేసుకుంటున్నాను, నా ఉద్దేశ్యం ఎవరిని బాధ కలిగించడం కాదు తెలిసి చేసినా తెలియకుండా చేసిన తప్పు తప్పే మీరందరూ పెద్ద మనసు చేసుకొని నన్ను క్షమిస్తారని కోరుకుంటున్నానన్నారు.



Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com